మాజీ సర్పంచ్‌కు దుబ్బాక ఎమ్మెల్యే పరామర్శ

పెద్దతండాలో మాజీ సర్పంచ్ బిక్యానాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 23 : నార్సింగి మండలం నర్సంపల్లి మాజీ సర్పంచ్, సొసైటీ డైరెక్టర్ బిక్యానాయక్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం పెద్దతండాలో బిక్యానాయక్ ఇంటికి వచ్చి, పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నార్సింగి ఎంపీపీ సబితారవీందర్, జడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలరాం బాబు, సర్పంచ్ చత్రీయానాయక్, సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్, ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు రాజేశ్, శ్రీపతి రావు, జెట్టి స్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, భాష తదితరులు ఉన్నారు.

ప్రమాదబీమా పరిహారం చెల్లించాలి

అదనపు కలెక్టర్‌కు మత్స్యకార్మికుల కుటుంబాలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 23 : ప్రమాదవశాత్తు మృతి చెందిన 38 మంది మత్స్యకారుల సభ్యుల కుటుంబాలకు బీమా పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. 2021-22లో ప్రమాదవశాస్తు పలువురు మత్స్యకారులు మృతి చెందారని, ఆయా కుటుంబాలకు ఇప్పటివరకు బీమా పరిహారం అందలేదన్నారు. ఈ విషయంలో టైపిస్టు అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారని, సస్పెండైన టైపిస్టు తిరిగి ఉద్యోగంలో చేరినా ఇంకా మత్స్యకారులు కుటుంబాలకు బీమా పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రూ.6 లక్షల ప్రమాద బీమా పరిహారం చెల్లించాలని కోరారు.

ఆటలో గెలుపోటములు సహజం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జనవరి 23 : క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జెన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన, మెదక్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీపతిరావు, లైబ్రరీ సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

రామాయంపేట, జనవరి 23 : రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంఈవో నీలకంఠం అన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. రామాయంపేట మండలంలోని అక్కన్నపేట, ఝాన్సీలింగాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వచ్చేది పరీక్షల కాలమని, ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రంప్రత్యేక క్లాసులు చెప్పాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.

నిబంధనలు పాటించాలి

జిల్లా ఇన్‌చార్జి రవాణాధికారి రిచర్డ్స్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 23 : వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులు లేదా సరుకులను రవాణా చేస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని, డ్రైవర్ లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా ఇన్‌చార్జి రవాణాధికారి రిచర్డ్స్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం పురస్కరించుకొని మంగళవారం మెదక్ పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించి డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహన సామర్థ్యం మేరకే ప్రయాణికులు లేదా సరుకులను రవాణా చేయలన్నారు. వేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. వాహనదారులందరూ రోడ్డు నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు.

రామాయంపేటలో పశువైద్య శిబిరం

రామాయంపేట, జనవరి 23 : పాడిపరిశ్రమ యజమానులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పాలిచ్చే పశువుల పాల పొదుగు కోసం పశువులకు అవసరమైన దాణాను అందజేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రామాయంపేట పశువైద్యశాలలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు గర్భధారణ, పాల పొదుగు, దూడలకు నట్టల నివారణ చికిత్స చేశారు. పాలిచ్చే గేదెలకు మంచి పోషకాలు ఉన్న దాణా లేదా పచ్చిగడ్డి పెట్టాలని సూచించారు. వెటర్నరీ అసిస్టెంట్ రాజు, గోపాల మిత్రలు ప్రసాద్, శ్రీను, చంద్రశేఖర్, నవీన్, రాజు, స్వామి ఉన్నారు.

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి

కొల్చారం : పైతర పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు

కొల్చారం, జనవరి 23 : విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని కరాటే మాస్టర్ మల్లేశం పిలుపునిచ్చారు. పైతర గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో కొల్చారం, కౌడిపల్లి మండలాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం రెంజుకి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి కరాటే బిల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు నగేశ్, అబ్జర్వర్స్‌గా దినకర్, భూపాల్, గణేశ్ వ్యవహరించారు. కరాటే బెల్ట్ ఎగ్జామ్‌లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, రఘురాం, బిందు, రమేశ్, రాంచందర్, రవళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్
- ఎంపీడీవోల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 23 : వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవోలను జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్ ఆదేశించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో వెంకట్ శైలేశ్ జిల్లాలోని ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఫైనాన్స్ నిధులు, స్టేట్ మ్యాచింగ్ నిధులు, స్టేట్ ఫైనాన్స్ నిధులతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. పనులు ఏ పురోగతిలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రారంభించిన పనులను త్వరితరగతిన పూర్తి చేయాలని, ప్రారంభించని పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. వివిధ మండలాల్లో అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేయాలన్నారు. పనులను పూర్తి చేయడానికి పీఆర్ ఈఈ నర్సింహులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో అరుంధతి పాల్గొన్నారు.

టీఎన్జీవో నర్సాపూర్ యూనిట్ ఎన్నిక

నర్సాపూర్, జనవరి 23 : ఉద్యోగులందరూ సమష్టిగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో నర్సాపూర్ యూనిట్ కమిటీని ఎన్నుకున్నారు. నర్సాపూర్ యూనిట్ అధ్యక్షుడిగా శేషాచారి, కార్యదర్శిగా రాకేశ్, ఉపాధ్యక్షుడిగా బాసిత్ అలీ, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రకటించారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ కార్పొరేటర్

పాపన్నపేట, జనవరి 23 : ఏడుపాయల వనదుర్గా భవానీమాతను మంగళవారం హైదరాబాద్‌లోని చింతల్ మాజీ కార్పొరేటర్ వీవీ సాగర్‌రావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకుడు హనుమంతరావు, న్యాయవాదులు కామారెడ్డి వేణు, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఆగ్రో కేంద్రం తనిఖీ

కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కొల్చారం, జనవరి 23 : మండల కేంద్రం కొల్చారంలోని ఆగ్రో కేంద్రాన్ని తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, ఏవో శ్వేతకుమారి మంగళవారం తనిఖీ చేశారు. యూరియా కొరత రాకుండా ముందస్తుగా తనిఖీలు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆగ్రో కేంద్రంలో ఎరువులు, విత్తనాల నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆగ్రో కేంద్ర నిర్వాకుడు దశరథం ఉన్నారు.

29 నుంచి జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 23 : 29, 30వ తేదీల్లో జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో శైలేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న వ్యవసాయం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, 30న గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధి పనులపై సమావేశాలు జరుగుతాయన్నారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని జడ్పీ సీఈవో శైలేశ్ సూచించారు.

నేడు 'ఎనీమియా ముక్త్ భారత్' ప్రారంభం

- కిశోర బాలబాలికల్లో రక్తహీనతను నివారించడమే లక్ష్యం
- జిల్లాలో 6 బృందాల పర్యటన 32,850 మంది పిల్లలకు రక్తహీనత పరీక్షలు

మెదక్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో 'ఎనీమియా ముక్త్ భారత్' కార్యక్రమం ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 10 వరకు నిర్వహించనున్నారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారించి, వారిని ఆరోగ్యవంతులుగా చేయడానికే 'ఎనీమియా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం డీఎంహెచ్‌వో చందూనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 'ఎనీమియా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా మొత్తం ఆరు బృందాలు పాల్గొననున్నాయి. జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే 32,850 మంది పిల్లలకు ఆర్‌బీఎస్‌కే బృందాలు యాక్షన్ ప్లాన్ ప్రకారం రక్త పరీక్షలు నిర్వహిస్తారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న పిల్లలందరినీ గుర్తించి, వారికి మూడు నెలల పాటు బ్లూ(నీలం) కలర్ ఐరన్ మాత్రలు ఇస్తారు. రక్తహీనత నివారణకు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, బెల్లం, ఖర్జూర పండ్లు, లివర్, దానిమ్మ పండ్లు, గుడ్లు మొదలగువాటిని అధిక మొత్తంలో తీసుకోవాలని డీఎంహెచ్‌వో చందూనాయక్ సూచించారు. స్కూలుకు వెళ్లని పిల్లలను గుర్తించి, వారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి, ఐరన్ మాత్రలు ఇస్తారు. రక్తంలో ఐరన్ శాతం పెరగడానికి తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలను ఆర్‌బీఎస్‌కే బృందాలు వివరిస్తారు. బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 'ఎనీమియా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని డీఎంహెచ్‌వో చందూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి

నిజాంపేట, జనవరి 23 : క్రమం తప్పకుండా ప్రతినెలా చివరి పని రోజు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా ఎక్కడా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించలేదన్నారు. ప్రతి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని మంగళవారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు సంజీవ్ వినతిపత్రం అందజేశారు.

పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సంతోష్

చేగంట, జనవరి 23 : పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాయితీ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పాతూరి రవి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఎన్నికలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా బి.రాకేశ్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, లింగప్ప, నవీన్, రజనీకాంత్, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్‌రెడ్డి, జితేందర్, రమేశ్, నారాయణను ఎన్నుకున్నారు.

సంఘటితంతో సమస్యల పరిష్కారం

జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దొంత నరేందర్

ఎన్నికైన ప్రభాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు

రామాయంపేట, జనవరి 23 : ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ఉద్యోగులంతా సంఘటితంగా ఉండి పరిష్కరించుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం రామాయంపేట టీఎన్జీవో కార్యాలయంలో యూనిట్ సమావేశం ఏర్పాటు చేసి, రామాయంపేట కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుముల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులుగా నిఖిల్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆర్.గాంధీ, ప్రదీప్, కోశాధికారిగా గణేశ్, సభ్యులుగా కుమార్, ప్రదీప్, నవీన్, సుధ, సాయిరాజ్, మహేందర్, ముత్యం తదితరులను ఎన్నుకున్నారు.

కోళ్ల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, జనవరి 23 : కోళ్ల వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామశివారులోని మెదక్-చేగుంట రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... వెల్దుర్తి మండలం రామయపల్లికి చెందిన కుర్మ మల్లేశం(45) మంగళవారం రాత్రి చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామ శివారులో కోళ్ల వ్యాన్ ఢీకొట్టడంతో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మూర్ఛతో కాల్వలో పడి వ్యక్తి మృతి

పాపన్నపేట, జనవరి 23 : పొలం పనులకు వెళ్లిన వ్యక్తికి మూర్ఛ రావడంతో మృతి చెందిన ఘటన పాపన్నపేట మండలం గాజులగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై సంగన్న తెలిపిన వివరాలు ... గాజులగూడెం గ్రామానికి చెందిన నాయికోటి లక్ష్మయ్య(37) మంగళవారం వ్యవసాయ పనుల్లో భాగంగా భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. భార్యను పని చెయ్యమని చెప్పి కొంత దూరంలో ఉన్న మరో పొలంలోకి నీరు పారపెట్టడానికి లక్ష్మయ్య వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే మూర్ఛ రావడంతో పొలంలోని నీటి కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపు అయినా రాకపోవడంతో భార్య కవిత అక్కడికి వెళ్లి చూడగా లక్ష్మయ్య నీటి కాల్వలో పడి అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సంగన్న తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

తూప్రాన్, జనవరి 23 : ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరూ కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

నర్సాపూర్, జనవరి 23 : నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న మురళీ యాదవ్ రాజీనామా చేయడంతో వైస్ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న నయీమొద్దీన్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరుకావాలని సమాచారం ఇచ్చామన్నారు. కలెక్టర్/ఎన్నికల అధికారి ఫారం-1 ద్వారా తూప్రాన్ రెవెన్యూ డివిజన్ అధికారిని మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ప్రత్యేక అధికారిగా నియమించారన్నారు. 29న ఎన్నిక జరగని పక్షంలో తర్వాతి రోజు 30న నిర్వహిస్తామని వెల్లడించారు.

నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

నేతాజీకి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు నేతాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ నిర్వహించిన పాత్ర శ్లాఘనీయమని ప్రజా ప్రతినిధులు కొనియాడారు. నేతాజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు.

-మెడక్ జిల్లా నెట్ వర్క్, జనవరి 23

తూప్రాన్ పట్టణంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మన్నె శ్రీనివాస్ రావు

చిన్నశంకరంపేటలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువజన సంఘాల నాయకులు

పెద్దశంకరంపేటలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 23 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, లాసెట్ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో www.tmreistel angana.cgg. gov.in వెబ్‌సైట్ లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా లేదా నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో బైపీసీ, ఎంపీసీలో ముస్లింలకు 26, క్రిస్టియన్లకు 2, పార్సీ, జైనులు, బుద్ధులు, సిక్కులకు 3, ఓసీలకు 1, ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5 సీటు ఉన్నాయన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 8374614691 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికల హాస్టల్‌లో..

నర్సాపూర్, జనవరి 23 : మోడల్ స్కూల్‌కి అనుబంధంగా ఉన్న బాలికల హాస్టల్‌లో వంట చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ శ్వేత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్-2 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కావాలని ఆమె కోరారు. కేర్ టేకర్ పోస్టుకు ఏదైనా డిగ్రీ, బీఈడీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హెడ్ కుక్ పోస్టుకు పదో తరగతి పాసై వంట చేయడంలో అనుభవం ఉండాలని, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలని, వంట చేయడంలో రెండేండ్ల అనుభవం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు మోడల్ స్కూల్ జక్కపల్లిలో ఫిబ్రవరి 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక అలవర్చుకోవాలి

నర్సాపూర్, జనవరి 23 : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి సూచించారు. పెద్దచింతకుంట గ్రామ సమీపంలోని జలహనుమాన్ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహానికి మాధవానంద సరస్వతీస్వామి మంగళవారం పూజలు నిర్వహించారు. జలహనుమాన్ వద్ద బారీ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పండితులు హరిప్రసాద్ శర్మ, పూజారి రాధాకృష్ణ, సర్పంచ్ శివకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బాలరాజ్, వైస్ చైర్మన్ ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

అంబాజిపేటలో ఉర్సు ప్రారంభం

చిన్నశంకరంపేట, జనవరి 23 : మండల పరిధిలోని అంబాజిపేటలో సోమవారం రాత్రి ఉర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా షాదుల్లా బాబా దర్గాకు పూలు, గంధం తదితర పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు నారాయణ, రహీం బూరానుద్దీన్, నవాజ్, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్, జనవరి 23 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బీహార్ రాష్ట్రానికి చెందిన మురారి కృష్ణ కుటుంబం 20 ఏండ్లుగా కాళ్లకల్ గ్రామంలో అద్దెకు ఉంటూ జీవిస్తున్నది. ముగ్గురు అన్నదమ్ముళ్లలో చిన్నవాడైన మురారి మిశ్రా కాళ్లకల్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి 10 గంటల సమయంలో షాపునకు వెళ్లి, పడుకుంటాను అని ఇంట్లో చెప్పి, వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు పెద్దన్న సంతోష్ మిశ్రా ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే షాపులోకి వెళ్లి చూడగా మురారి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి అన్న వినయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్‌నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323058

CHANGE OF NAME

★ I, NIZAMPURAM UMA RANI, W/o. Nizampuram Srinivas, Aged 55 yrs., Occ: House Wife, R/o. H.No. 1-8, Nandikandi Village, Sadasivapet Mandal, Sangareddy Dist., T.S-502 306, have state that in My Husband's Passport My Name is mentioned as N.UMA RANI. So that both Names i.e., NIZAMPURAM RANI for all purposes.
NT-MDK

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.